# ఘర్మజలానికి ....... ఖరీదు కట్టే షరాబు....?

రతన్ కడుపులో ఎలుకలు పరుగెడుతున్నాయి——విపరీతమైన ఆకలిగా వుంది—రాత్రి కూడా భోజనం సరిగా చేయలేదు.. ప్రొద్దున్న వచ్చేటప్పుడు కషాయంలా వున్న గ్లాసెడు టీనీళ్ళు తాగొచ్చాడు—అవెప్పుడో భస్మమై పోయాయి — పిట్ట మధ్యాహ్నమవుతుంది... పొద్దుటి నుంచి ఒక్కబేరం కూడా కుదరలేదు–"ప్రొద్దున లేచి ఎవ్వాల మొకం సూసినో—ఒక్కగిరాకి వత్తలేదు "తనలో తానే గొణుక్కున్నాడు టవర్ ప్రక్కన రిక్షాపెట్టి గిరాకి కొరకెదురు చూస్తున్నాడు ... చూచి చూచి కళ్ళుకాయలు కాస్తున్నాయి—అయినా లాభం లేదు-రోడ్డుపై పోతున్న వాళ్ళనుద్దేశిస్తూ "రిక్షా కావాలా సార్! రిక్షా కావాలా అమ్మా" అరుస్తూనే వున్నాడు ఒక్కరూ అతని ముఖం చూడటం లేదు. ప్రొద్దు గడుస్తున్న కొద్దీ కడుపులో అగ్నిపర్వతాలు బ్రద్దలవుతున్నాయి. రిక్షాకొంత దూరంలోనోరూరించే మిరపకాయ బజ్జీల బండి, అరటి పళ్ళ బండి, ఎదురుగా ఢిల్లీవాలా స్వీటు హౌస్...చూస్తూ గుటకలు మింగుతున్నాడు రతన్. స్వీటుపోనీ, అరటిపండు పోనీ, ఒక్క మిరపకాయ కనీసం టీ నీళ్ళతోనైనా ఆత్మారామున్ని సంతృప్తిపరుద్దామంటే జేబులో పైసాలేదు. ఒక్క గిరాకొచ్చిన బాగుండు'' అనుకున్నాడు. లొటపెట పెదవులకెదిరి చూసే నక్కలా ఎదిరి చూస్తూనే వున్నాడు కాని అతనిపై ఎవరికి కనికరం కలగడం లేదు. రిక్షా బయటకు తీసి రోడ్డుపై నాలుగు దిక్కులా తింపాడు. నడిచిపోతున్న వ్యక్తుల దగ్గర స్లో చేసి "రిక్షా కావాలా సార్" అనడిగాడు... అయినా గిరాకి దొరకడం లేదు. నీరసంవల్ల కాళ్ళు నొప్పెడుతున్నాయి. రిక్షాతెచ్చి టవర్ పక్కనుంచాడు

కాల్లు గుంజుతుంటే బయటకు చూస్తూ రిక్షాలో ఒరిగాడు.. ఆలోచనలో పడ్డాడు అతని మనసు గత జీవిత పుటలవెంట పరిగెడుతుంది.

... .... ...

రతన్‌ది కరీంనగర్ జిల్లాలోని ఓ కుగ్రామం స్వంతవూరు. ముప్పై ఏళ్ళ క్రితం లంబాడీ కులంలో పుట్టాడు. అతని తాతలు పాలేర్లుగానే బ్రతికారు. ఏ భూవసతీ లేని రతన్‌కు కూడ పాలేరుండటం తప్పలేదు. పదిహేనేల్ల వయసు పడి దాదాపు పదేళ్లు పాలేరుగానే బ్రతికాడు. కాయ కష్టం చేసాడు. పనికి రాత్రి పగలు తేడాలేదు. శక్తి వంచన లేకుండా పనిచేసాడు. ఒళ్ళు హూనం చేసుకున్నాడు. అయినా యజమాని మెప్పు కంటే తిట్లనే ఎక్కువ పొందాడు. పోగా యజమానిచ్చే ఏడాదికి రెండు వేల జీతం సరిపోయేది కాదు. తన సంపాదన భార్య కూలి చేసి సంపాదించినా కుటుంబం గడవడం కష్టంగానే వుంది. ఇద్దరు పిల్లలు కలిగాక తర్వాత ఖర్చులు మరింత పెరిగాయి. పొట్ట గడవడమే కష్టంగా వుంది. జీతం పెంచమంటే యజమానిక్కోపం. ఇక ఆ వూళ్ళో బ్రతకడం కష్టమనుకున్నాడు. పోగా పిల్లలను చదివించుకోవాలన్న కోర్కె రతన్‌కుంది. పాలేరు బతుకుతో తమకే పొట్టలు నిండకుంటే పిల్లలను చదివించేదెలా అనుకున్నాడు. ఊరు విడిచి పోవడానికి నిర్ణయించుకున్నాడు. పట్నం వెళ్ళి ఏ హమాలిగానో, కూలిగానో, రిక్షావాడిగానో స్థిరపడితే ఇంతకంటె ఎక్కువే సంపాదించుకోవచ్చనుకున్నాడు ఊళ్లో ఉన్న చిన్న పెంకుటిల్లు నమ్మాడు. ఊరు బయటున్న అరెకరం చెలుక నమ్మాడు. భార్య పిల్లలతో కరీంనగర్ చేరుకున్నాడు కార్ఖానగడ్డలో అరగుంట భూమి తీసుకున్నాడు. చిన్న గుడిసె వేసుకున్నాడు. ఉన్న డబ్బయిపోయింది. స్వంత రిక్షా కొనుక్కునే శక్తి లేదు. బాడుగకు తీసుకుని రిక్షా నడుపుతూ కాలం గడుపుతున్నాడు. త్వరలోనే పట్టణ జీవితం చేదు అనుభవానికొచ్చింది రతన్‌కు. పందుల గుహలా ఉన్న చిన్నగుడిసె చుట్టూ

మురికి, జయ్ మంటూ ఈగలు, దోమలు, గబ్బు వాసన, జాలర్ల కంపు పొద్దంతా రిక్షాలాగి ఏ అర్ధరాత్రికో ఇంటికొచ్చి పడుకుంటే నిద్రపట్టదు.

పిల్లలను బడికి పంపుదామంటే ప్రభుత్వ పాఠశాలల్లో సీట్లు దొరకవు. ప్రైవేటు పాటశాలలో ఫీజు భరించడం అతని వల్ల కాదు. తనపై తనకే జాలేసింది రతన్‌కు.

ఐదేళ్ళ నుంచి చేస్తున్న తన వృత్తిలో పొందిన అనుభవాలు జ్ఞాపక మొస్తున్నాయి రతన్‌కు. రిక్షా వాళ్ళు తమనేదో మోసం చేస్తున్నట్టు కొసరి కొసరి బేరం చేస్తుంటారు. ఎన్నో దుబారా ఖర్చులకు నూర్లు, వేలు వృథా చేసే పెద్ద మనుషులు కూడా రిక్షా వాడితో రూపాయి అర్ధ రూపాయి విషయంలో కూడా కొసరుతుంటాడు. కాళ్ళు పీక్కుపోతుం డగా డొక్కలు లోపలికెలుతుండగా నిక్కుతూ, నీలుగుతూ ఆయాసంగా రిక్షా తొక్కినా ఎవరికీ దయా దాక్షిణ్యాలుండవు ఇచ్చే రెండు మూడు రూపాయలు అనవసరంగా యిస్తున్నట్టు ఫోజుపెడుతూ ఇస్తారు. ప్రొద్దు నుంచి రాత్రి వరకు శ్రమ పడితే మంచి గిరాకీ వున్న రోజు ఇరవై ఇరవై అయిదు రూపాయల వరకు దొరకొచ్చు. ఒక్కొక్క రోజు పది దొరకడం కష్టమే, మరో సారయితే రిక్షా కివ్వాల్సినబాడుగ ఐదు రూపా యలు దొరకడం గగనమే. ఈ సంపాదనతో బ్రతకడం కష్టంగానే వున్నా తప్పదు. తన ఆరోగ్యం మంచిగా లేకున్నా, యింట్లో భార్య పిల్లల ఆరోగ్యం బాగా లేకున్నా పనికిపోవడం తప్పదు. పోసీ రోజు దాదాపు పస్తులే. ఏ రోజు దొరికిన డబ్బుతో ఆ రోజు బియ్యం. నూనె పప్పు లాంటి నిత్యావసర వస్తువులు కొనుక్కోగా మిగిలేది దాదాపు శూన్యమే. ఐదూ పది అప్పుడప్పుడు మిగిల్తే బట్టలు కొనుక్కోవడాని కవుతాయి. జబ్బుపడితే డాక్టర్ దగ్గర కెళ్ళడానికైనా డబ్బుండదు. అత్యా వసర సమయంలో నూటికి నెలకు పది వడ్డీ చొప్పున సింగ్ దగ్గర అప్పు తెచ్చుకోవాలి. రెక్కలు ముక్కలు చేసుకొని సంపాదించిన డబ్బుతో

వడ్డీ కట్టానికి సతమతమవాలి. ఇక్కడి బతుక్కంటే పల్లెటూరు బ్రితుకే నయం. ఎన్నోసార్లు అనుకోకుండా ఉండలేకపోయాడు రతన్

రకరకాల వ్యక్తులు రిక్షా ఎక్కుతుంటారు. ఒకరు కసురుకుంటారు ఒక్కొక్కరు తిడుతారు కూడా కొందరు చులకనగా మాట్లాడుతారు. అయినా ఓపికగా భరించాలి. భరించకుంటే బేరాలు వదులుకోవాల్సి వస్తుంది. అవసరానికి మించిన పోటీ వున్న సమయంలో అణుకువ లాంటిదవసరం. కొంత మంది రిక్షావాళ్లు దాదాగిరి చేసినా అలాంటివాళ్లు చాలా తక్కువ. కొందరు ప్రియాణికులు రిక్షాలోనే కూర్చొని పరిహాసాలాడుకుంటారు. నవ్వుతూ తుళ్ళుతుంటారు. ఏవేవో మాట్లాడుతుంటారు. రిక్షావాడు వినీ విననట్టు నటించాలి.

ఏం బ్రితుకులు? తనలో తానే గొణుక్కున్నాడు రతన్. ఓ రోజు రాంలాల్ సేఠ్‌తో జరిగిన ఘర్షణ జ్ఞాపకమొచ్చింది రతన్‌కు ఉప్పు బస్తాలాంటి ఆకారంతో క్వింటాల్ పైన్నే బరువున్న రాంలాల్ గడియారం దగ్గర రిక్షా ఎక్కాడు. ఆయాసపడుతూ S.R R. కాలేజి దగ్గరకు ఈడ్చుకు పోయాడు రతన్. రిక్షాదిగి చేతిలో రెండు రూపాయలు పెట్టాడు.

'సేఠ్ జీ ఇంకో రెండు రూపాయలియ్యండ్రి" అన్నాడు రతన్.

"ఒక్క మనిషికి నాల్గు రూపాయలా? ఎక్కడ నేర్చుకున్నావు....? పో పో" అని నడవ సాగాడు రాంలాల్.

"సేఠ్‌సాబ్! గడియారం నుంచిక్కడికి చాలా దూరముంది. రెండు రూపాయలియ్యండ్రి'' అని అడ్డంబోయి నిల్చున్నాడు రతన్.

''పోరా పో రెండ్రూపాయలే ఎక్కువ" అని కసిరాడు.

"మర్యాదగ మాట్లాడుండ్రి సేఠ్" ఇక్కడికి నాల్గురూపాయలు రోజు వస్తునే వున్న అన్నాడు రతన్.

''ఏందిరా నీతోని మర్యాదగ మాట్లాడేది? రెండు రూపాయల కన్న ఒక్క పైసెక్కో ఇయ్య ఏం జేసుకుంటావో చేసుకో పో'' అని నడు

పసాగాడు రాంలాల్. ఇలాంటి వాడితో మొదలే బేరం చేయాల్సింద అను కున్నాడు రతన్.

''నా రెండ్రూపాయలతో ఇల్లుగట్టుకు పో" అని తిరిగొచ్చాడు రతన్ ఇలాంటి వారెంతో మంది ఎదురయ్యారు రతన్‌కు.

ఎవరైనా బేరం కంటె అర్థరూపాయో, రూపాయో, ఎక్కువిస్తే రిక్షావాళ్ళ కళ్ళలో వెలుగు. కృతజ్ఞతా భావం అలా ఇచ్చేవాళ్లుండరుకాని అప్పుడప్పుడు ఎవరో ఒకరు తటస్థపడుతుంటారు

రతన్ కూతురు తల్లితో పాచి పనులు చేయడానికెల్తుంది. ఏడేళ్ళ కొడుకునైనా చదివిస్తే బాగుండును అనుకున్నాడు రతన్.

తన జీవుతం గూర్చి ఆలోచిస్తూ వెనుక సీట్లో ఒరిగిన రతన్ ''ఎయ్ రిక్షా" అన్న పిలుపుతో ఈ లోకంలో కొచ్చాడు. గబగబా లేచి రిక్షా తొక్కుతూ కొంచెం దూరంలో వున్న పిలిచిన మనిషి దగ్గరి కెళ్ళాడు.

''ఎక్కడి కెళ్లాలి సార్?" అడిగాడు రతన్.

"మంకమ్మతోటకు వస్తావా?" అడిగాడా వ్యక్తి

"మా వస్తా సార్ ఎక్కండ్రి"

"ఏం దీసుకుంటావో చెప్పు"?

''ఎంత మంది సార్''?

''ఇద్దరు పెద్దోళ్ళం, ఒక్క బాబు''

టవర్ దగ్గర్నుంచి మంకమ్మతోటకు ఇద్దరికయితే నాల్గు రూపాయలు మామూలు బాడుగ బాబున్నాడు కాబట్టి ఇంకో రూపాయి కలుపు కుంటే ఐదు రూపాయలు ఎలాగూ బేరంలో ఓ రూపాయి తగ్గిస్తారని "ఆరు రూపాయలియ్యండ్రి సార్'' అన్నాడు రతన్.

"ఏంది మేం కొత్తొల్ల మనుకుంటున్నావా? ఎన్నిసార్లెక్కుత లేము?" అన్నాడా వ్యక్తి.

"ఎంతిస్తారో చెప్పండి సార్"

"మూడు రూపాయల కంటెక్కువ ఇయ్య "

'ఇద్దరికే నాల్గురూపాయలిస్తరు సార్  ఐదు రూపాయలియ్యండి"

"మూడు రూపాయలకంటే ఒక్క పైసెన్నెక్కువ ఇయ్యం. పోఇట్టం"

అని పోబోయాడా వ్యక్తి.

ప్రొద్దుట్నుంచీ ఒక్క బేరమూ లేదు. వచ్చిన ఈ ఒక్క బేరా న్నిలా వదలి పెట్టుకోవడం ఇష్టం లేదు రతన్‌కు  మధ్యాహ్న బోజనా నికింటికెళ్ళే వరకొక్క బేరమన్నా సంపాదించుకోంది బాగుండదను కున్నాడు. సరే, పొయ్యేదేముంది నా రెక్కల కష్టమే కదా అనుకొని.

"ఐదు రూపాయలు పడదు కాని నాల్గ రూపాయలియ్యండి సార్" అన్నాడు.

"మూడన్నరిస్త నీ యిష్టం" అంటూ పోబోయే వాడాగాడు.

"సరే ఎక్కండి" అని టాప్ తీసివేసాడు రతన్.

ఆ వ్యక్తి, అతని భార్య ఎనిమిదేళ్ళ బాబు ముగ్గురూ రిక్షా ఎక్కి కూర్చున్నారు. రతన్ ఎక్కి మంటమ్మతోట దిక్కు నడిపిస్తున్నాడు రిక్షాను. కడుపులో నకనక లాడుతూ ఆకలి నీరసం...రిక్షా కదలడం లేదు. "పోనివోయ్ తొందరగా పోనియ్.. అరిచినట్టాడన్నాడా వ్యక్తి.

"పోనిస్తూనే వున్నా కదా సార్" అని బలం కూడదీసుకొని తొక్కు న్నాడు పైన నిప్పులు కక్కుతూ ఎండ, చెమట దారాపాతంగా కారు తుంది. చెమట నీటితో వేసుకున్న బనీను తడిసిముద్దయింది కళ్ళకు చెమటొచ్చి పైడిల్ జారుతున్నాయి. రిక్షా తొక్కుతూనే కడుపులో ఏదైనా పడితే బాగుండేది అనుకుంటున్నాడు. కాని ప్రస్తుతం ఆ అవకా శమే లేదు రిక్షా ఆపి టీ తాగుదామన్నా డబ్బులేదు గిరాకీ నడుగుతే కసురుకుంటారు డబ్బు చేతిలో పడ్డ తర్వాత హోటల్ కెళ్ళి టిఫిన్ చేయాలని అనుకుంటూ రిక్షా తొక్కుతున్నాడు.

"టిపిన్ చేస్తే కడుపేం నిండుతుంది? ఇంటికెళ్ళి అన్నం తినాలి" మళ్ళీ అనుకున్నాడు రతన్.

"ఇంట్ల బిడ్డ జ్వరమొచ్చి పన్నది డాక్టర్ దగ్గరకు తీసుకపోవలె సర్కారు దావఖానకు తీసుకపోతే రంగు నీళ్ళిత్తరు, దాంతోని జ్వరం తగ్గది. ప్రైవేటు డాక్టరు దగ్గరకు తీసుకెళ్ళాలె. ఓ పదిరూపాయలన్న వస్తే బాగుండు'' ఆలోచిస్తూ రిక్షా నడిపిస్తున్నాడు దమ్మొస్తుంది, ఎగపోతొస్తుంది. ఎదురుగా వొస్తున్న లారి రిక్షాకు నాలుగగుంళాల దూరము నుంచి సర్ మని దూసుకపోయింది. గజ గజా వణికాడు రతన్. ఇంకొంచెం ఇథైతే తన పని అంతే అనుకున్నాడు... రిక్షాలో కూర్చున్న వాళ్లు అటూ ఇటూ ఊగారు.

"ఏందేయ్ తాగినవా''? కొంచెమయితే లారి కిందికి పొయ్యేది సూసుకుంట పోనియ్యి. ఏం రిక్షా దొరికిందిరా బాబు" అన్నాడతను

రిక్షావాళ్ళంటే త్రాగుబోతులన్న అభిప్రాయం చాలామందికుంటుందని రతన్‌కు తెలుసు. తాను ప్రొద్దుటి నుంచి గుక్కెడు టీ నీళ్లు తప్ప ముట్టుకోలేదని చెప్పాలనుకున్నాడు లాభం లేదని ఊరుకున్నాడు.

''లేద్సార్ ఆ లారోడే పూర్తిగా రాంగ్ సైడచ్చిండు.వాళ్ళకు కండ్లు కనపడయి" అన్నాడు రతన్.

"సరెగని పోనియ్" కసిరాడతను.

ఆయాసపడుడూ రిక్షా తొక్కుతున్నాడు. రతన్ ఎత్తు గడ్డొచ్చింది రిక్షా కదలడం కష్టంగా వుంది. సీటుపై నుండి లేచి తొక్కుతున్నాడు. అయినా కదలడం లేదు. ఇక లాభం లేదని రిక్షాదిగాడు. కళ్ళను భూమికి నొక్కి పెడుతూ పండ్లు బిగబట్టి బలవంతంగా రిక్షాను చేతుల్తో నడిపిస్తున్నాడు. కొంత దూరం అలాగే అతి కష్టంగా తీసుకెళ్లాడు. మళ్ళీ రిక్షా ఎక్కి నడిపిస్తున్నాడు...కూచున్న తోలు సీటు చెమట నీళ్ళతో తడిసింది. చేతకాకున్నా తొక్కుతూనే వున్నాడు. ఓ పండ్ల దుకాణం సమీ

పించగానే 'ఏయ్ రిక్షా ఆగు" అన్నాడు రిక్షాలోని పెద్దమనిషి. ఆపాడు రతన్.

"ఓ డజను అరటి పళ్ళు తీసుకురాపో' అని ఐదు రూపాయల నోటు రతన్ చేతి కిచ్చాడు. అరటి పళ్ళు మిగిలిన ఒక రూపాయి చిల్లర తెచ్చి ఇచ్చాడు రతన్. రిక్షా ఎక్కి తొక్కుతున్నాడు... ఎదురుగా ఓ కాలేజి కుర్రాడు యమస్పీడుగా సైకిల్ తొక్కుతూ వస్తున్నాడు. గంట మ్రోగించాడు రతన్. ఎటో చూస్తూ సైకిల్ నడుపుతున్న కుంట ధ్వని విన్లేదు. అదే వేగంతో దూసుకొస్తున్న సైకిల్‌ను తప్పించడానికి పూర్తిగా ఎడమ ప్రక్కకు పోయాడు రతన్ రోడ్డు దిగింది రిక్షా. ఓ చిన్న గుంటలో దభీమని దిగింది. గొణుగుతూ రతన్‌ను తిట్టారు భార్యాభర్తలు. వాళ్ళను దింపి గుంటనుండి రిక్షాను పైకి లాగి మళ్ళీ కూర్చోమన్నాడు. కూర్చోగానే నడిపిస్తున్నాడు

కడుపులో పేగులు నులిపెడుతున్నాయి.. తన కష్టమయ జీవితమంతా జ్ఞాపకమొస్తుంది. తన మార్గంలో తాను పోతున్నా నిర్లక్ష్యంగా సైకిళ్ళు నడిపి యాక్సిడెంట్లు చేసి తనను వేదించిన కుర్రాళ్ళతనికి జ్ఞాపకమొచ్చారు. పల్లెజీవితాన్ని వదలిపెట్టి పట్నానికి కొచ్చి తానేం బావుకున్నాడో రతన్ కర్థం కావడం లేదు. పల్లెలో ఉన్న ఆత్మీయత పట్టణంలో కనబడటం లేదు రతన్‌కు. అంతా కృత్రిమత్వం ....

రిక్షా ఫైర్ స్టేషన్ దాటి సాగిపోతుంది. తలపై నుండి, ముఖంపై నుండి చెమట నోట్లోకి జారి ఉప్పగా తగులుతుంది. ఎడమచేత్తో ముఖాన్ని తుడుచుకున్నాడు. లాభం లేదు. ఇంకా చెమట కారుతూనే వుంది. ఎడమ చేత్తో హాండిల్ పట్టుకొని రిక్షా నడిపిస్తూ కుడిచేత్తో జేబులో వున్న దస్తీ బయటకు తీసాడు. ముఖం తుడిచాడు... దస్తీ చెమట వాసనొస్తుంది. దస్తీ పిండితే చాలు కారెంత తడిగా వుంది. దాని శక్తిని మించి వాడడం జరిగింది. రిక్షా తొక్కుతూనే కుడిచేత్తో పిండి ముఖం తుడిచాడు. ముఖ

మంతా తడిగా వుంది. దస్తీ తిరిగి జేబులో పెట్టుకున్నాడు. పాంటు జేబు తడిసి అది తొడకు చల్లగా తగిలింది. రిక్షా సాగిపోతూ వుంది.

ఓసారో వ్యక్తి తానే రిక్షాలో బ్యాగు మర్చిపోయానని తనను పోలీసు స్టేషన్ కప్పగించి కొట్టించిన విషయం జ్ఞాపకమొచ్చి నిట్టూర్చాడు రతన్. తన శరీరంలోని ఒక్కొక్క రక్తపు బొట్టును చెమటగా మార్చి సంపాదించిన ఇరవై రూపాయలు S.I చేతిలో పెట్టి బయట కొచ్చాడు. రిక్షా తొక్కుతూనే తన జీవితంలోని ఎన్నో సంఘటనలను మననం చేసుకుంటున్నాడు. రిక్షాలో వున్న దంపతులు ఏదో మాట్లాడు కుంటున్నారు. వారిద్దరి మధ్య వున్న బాబు రతన్‌నే చూస్తున్నాడు అత డాయాస పడుతూ రిక్షా నడపడం గమనిస్తున్నాడు పాపం రిక్షా అబ్బాయి అనుకున్నాడు.

రిక్షా మెల్లగా నడుస్తుంది.

"పోనియ్ తొందరగ పోనియ్ గిట్ల నడిపిస్తే బాగానే సంపాయిత్తవు" కసిరినట్టుగా అన్నాడు రిక్షాలోని పెద్దమనిషి. ఓసారి వెనుకకు తలతిప్పి చూసి మౌనంగా రిక్షా నడుపుతున్నాడు రతన్.

"పాపం రిక్షబ్బాయికి చెమటలస్తున్నాయి ఏమనకు డాడీ" ముద్దు ముద్దుగా అన్నాడు బాబు.

"అన్నీ నీకే కావాలి...చప్పుడుజేకుండు" కసురుకుందా బాబు తల్లి.

బాబుదిక్కోసారి కృతజ్ఞతా భావంతో చూసి తన పని కానిస్తు న్నాడు రతన్. అతి కష్టంగా ఆయాస పడుతూ రిక్షాను గమ్యస్థానం చేర్చాడు. రిక్షా దిగి చెమట తుడుచుకుంటూ వేగంగా శ్వాస వదులుతు న్నాడు రతన్. దంపతులు, బాబు రిక్షా దిగారు. జేబులో చెయ్యి పెట్టి ఐదు రూపాయల నోటు తీసాడతను. ఐదు రూపాయల నోటు చూసి....

"చిల్లర లెవ్వు సార్" అన్నాడు రతన్.

"గిట్లనే నకురాజ్లేత్తరు ఉంచుకొని లెవ్వంటరు తియ్యి తియ్యి" అన్నాడు.

"ఒక్క పైస గూడ లేదు సార్" అని జేబుల్లో చేతులు పెట్టి ఖాళీ చేతులు పైకి తీసాడు రతన్.

మాసిన గడ్డం, ఈడ్చుకుపోయిన ముఖం, మాసికలు పడ్డ పాంటు షర్టుతో నిల్చున్న రతన్ చెమటలో స్నానం చేసినట్టుగా వున్నాడు. "లోపలికిపోయి చిల్లర తీసుకొస్తుండు"అని లోపలికి పోయాడా వ్యక్తి

"డాడీ! పాపం రిక్షాబ్బాయికి ఆకలేస్తున్నట్టుంది. బాగా చెమటలు కారుతున్నాయి...బాగా కష్టపడ్డాడు, ఐదు రూపాయలియ్యి పాపం"అన్న కుర్రాడి మాటలతో అలాగే ఆగిపోయాడు.

"వేలెడంతలేడు వీని కన్నీ కావాలి" ఆ బాబును చేయిపట్టుకొని లోపలకు తీసుకెళ్ళి దతని తల్లి లోపలికెళ్ళి కొంత సేపట్లో ఓ రెండు రూపాయల నోటు, రూపాయి నోటు, అర్ధ రూపాయి చిల్లర తెచ్చి రతన్ చేతిలో పెట్టి వెళ్ళాడా వ్యక్తి.

తన జీవితంలాగానే, తన మురికి బట్టల్లాగానే నల్లగా మాసి మడతలు పడి జీర్ణావస్థలో వున్న నోట్లను భద్రంగా మలిచి జేబులో పెట్టుకున్నాడు రతన్.

కడుపు వెన్నుకంటుకు పోగా, కాళ్ళు గుంజుకు పోగా, కడవల కొద్ది ఘర్మ జలాన్ని ధారబోసి పనిచేసే రతన్ లాంటి వారి చెమట విలువ...? అలాంటి వారి ఘర్మ జలానికి ఖరీదు కట్టే షరాబు లెవరు? రతన్‌కు మాత్రం ఎనిమిదేళ్ళ ఆ బాబులో ఆ షరాబు కనిపించాడు. ఆ బాబు తరం వాళ్లైనా శ్రమజీవుల ఘర్మ జలానికి.ధర్మజలానికి నిజమైన ఖరీదు కట్టే షరాబులవుతారేమో ? బాబు రూపాన్నే మననం చేసుకుంటూ రిక్షాను వెనుకకు తిప్పాడు రతన్.